
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సోమవారం 17 జూన్ 2024

దేశంలో రాజ్యమేలుతున్న ఫ్యూడల్ వ్యవస్థ
● సన్యాసులు, బాబాల చేతిలో కీలుబొమ్మలుగా ప్రభుత్వాలు
● రాజ్యాంగ ధిక్కారానికి పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు
● ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం
5లో



వారంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశం

సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి

సంగారెడ్డి, జూన్ 16, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని మరో వారం రోజుల్లో నిర్వహించనున్నట్టు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి తెలిపారు. సమావేశం తేదీ, ఏర్పాట్ల గురించి ఆదివారం సాయంత్రం ఆయన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, కొండాపూర్‌కు చెందిన పార్టీ ముఖ్య నాయకుడు ప్రభుతో చర్చించారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయి నెల రోజులు గడిచిందని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఐదు వేలకు పైగా ఓట్ల మెజారిటీ రావడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎన్నికల్లో మిగిలిన రెండు పార్టీలు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌నే ఆదరించారని అన్నారు. అందువల్ల నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు మంచి సందేశం ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే, సంగారెడ్డి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఈ సమావేశంలో వివరించడం జరుగుతుందన్నారు. సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశం తేదీ, స్థలం త్వరలోనే వెల్లడిస్తామని జగ్గారెడ్డి తెలిపారు.





సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలో ఏర్పాటవుతున్న పారాబాయిల్డ్ రైస్‌మిల్

పరిశ్రమలు వచ్చేనా.. ఉపాధి దక్కేనా?

● వర్గల్, ములుగు మండలాల్లో గత ప్రభుత్వ హయాంలో టీజీఐఐసీ కారిడార్
● కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఉపాధి కల్పనపై హామీ
● అమూల్, కోకాకోలా, ఆటోమొబైల్ కంపెనీలతో ఎంవోయూ
● కంపెనీల ఏర్పాటుపై ఇప్పటికీ అతీగతి లేని వైనం ● ప్రభుత్వ నిర్ణయమే కీలకం
● ఇటీవల కోకాకోలా యూనిట్ తరలిపోయినట్లు వార్తలు?



వర్గల్ మండలంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక కాలనీ

గజ్వేల్, జూన్ 16 : హైదరాబాద్‌కు అతిచేరువలో ఉన్న సిద్దిపేట జిల్లా ములుగు, వర్గల్ మండలాల్లో పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం అడుగులు వేసింది. కాలుష్య రహిత పరిశ్రమలను తీసుకొచ్చి, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులకు, అలాగే గజ్వేల్ నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించేడమే లక్ష్యమని ప్రకటించింది. గత అసెంబ్లీ ఎన్నికల వేళ ఇదే అంశాన్ని ఊదరగొట్టారు. పరిశ్రమలు వచ్చాయని, ఎంవోయూలు చేసుకున్నామని చెప్పిందంతా ఆర్భాటంగానే మిగిలిపోయింది. ప్రభుత్వం మారడంతో నీలినీడలు కమ్ముకున్నాయి. ఎంవోయూ కుదుర్చుకున్న పరిశ్రమలు సైతం ఏర్పాటవుతాయో లేదో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి బలం చేకూర్చే విధంగా పలు పరిశ్రమలు ఇతర జిల్లాలకు తరలివెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి.

దాదాపు 3వేల ఎకరాల సేకరణ

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని వర్గల్, ములుగు మండలాల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, అవుసులోనిపల్లి, వర్గల్, ములుగు, అచ్చాయపల్లి గ్రామాల పరిధిలో మూడు వేల ఎకరాల సాగు భూమిని 2021-22 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం హుటాహుటిన సేకరించింది. ఇక్కడ టీజీఐఐసీ ఆధ్వర్యంలో పరిశ్రమ కాలనీని ఏర్పాటు చేశారు. ఈ భూములకు సంబంధించిన పరిహారాలను అందజేసిన అధికారులు, పలు పరిశ్రమలకు భూములను కేటాయిస్తున్నట్లు కూడా ప్రకటించారు. వర్గల్‌కు కోకాకోలా, అమూల్, ఆజాద్ ఎలక్ట్రికల్స్ లాంటి పరిశ్రమలు వస్తున్నాయని, ఇప్పటికే ఎంవోయూ కుదుర్చుకున్నామని ఆర్భాటంగా ప్రచారం చేశారు. కానీ కేవలం రెండు పారాబాయిల్డ్ పరిశ్రమలు, ఓ ఐస్‌క్రీం పరిశ్రమ మినహా ఎలాంటి భారీ పరిశ్రమలు ఇప్పటివరకు వచ్చిన దాఖలాలు లేవు. ఇక కోకాకోలా కంపెనీ పెద్దపల్లి జిల్లాకు వెళ్లినట్లు తెలియగా, ఐటీ శాఖ మంత్రిని కోకాకోలా పరిశ్రమకు చెందిన ప్రతినిధులు కలిసినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రజల్లో కొంత అభద్రతా భావం ఏర్పడింది. ఇదిలా ఉంటే గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సేకరించిన భూములకు ఇచ్చే నష్టపరిహారం అంశంలో కోర్టులకు వెళ్లారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వారు ముందుకు వెళ్తారా లేక వెనక్కి వస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారం

వర్గల్, ములుగు మండలాల్లో ఏర్పాటు చేసిన టీజీఐఐసీ కాలనీలో పరిశ్రమల ఏర్పాటు అంశంపై తాజాగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయమే కీలకంగా మారనుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను మూడు జోన్‌లుగా విభజించి అభివృద్ధి పరుస్తామని ప్రకటించారు. వర్గల్, ములుగు ప్రాంతం సేమీ అర్బన్ ప్రాంతమైన అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్యలో ఉండడంతో పరిశ్రమల ఏర్పాటు అనివార్యం కానుంది. అయితే, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ భూనిర్వాసితుల పరిస్థితి ఇప్పటికే ఉపాధి లేక అగమ్యగోచరంగా మారింది. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంతో ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు ఆధారపడింది.

నీకెంత..నాకెంత?

● సిద్దిపేట మున్సిపల్‌లో అవినీతి ఆరోపణలు
● డబ్బులిస్తేనే ఇళ్ల నిర్మాణానికి అనుమతులు
● డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అమ్ముకుంటున్నారు
● కౌన్సిల్ సభ్యుల ఆరోపణ



అధికారుల తీరుపై మండిపడుతున్న కౌన్సిల్ సభ్యులు(ఫైల్)

సిద్దిపేట టౌన్, జూన్ 16 : నూతనంగా ఇళ్లు, భవనం నిర్మించుకోవాలంటే సంబంధిత డాక్యుమెంట్‌లతో మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పరిశీలించి, భవన నిర్మాణ స్థలం, భవనం ప్లానింగ్, సెట్ బ్యాక్ తదితర వాటిని తనిఖీ చేసిన తరువాతే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి. కానీ ఆ నిబంధనలు ఏమి పట్టనట్టుగా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారని ఇటీవలే సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎలాంటి లింక్ డాక్యుమెంట్‌లు లేకున్నా సరే టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులను ఇచ్చేస్తున్నారని, ఇలా ఒకటి కాదు.. పదుల సంఖ్యలో నిర్మాణాలకు అనుమతులను జారీ చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్ ప్లానింగ్‌లో పలువురు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై నీకు ఎంత...నాకు ఎంత అంటూ డబ్బు పంచుకుంటున్నారని కౌన్సిల్ సభ్యులు బహిరంగగానే వ్యాఖ్యానిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు కాసుల కోసం కక్కుర్తిపడుతున్నారని ఆరోపిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇవ్వాలంటే ఇంజనీరింగ్ అధికారుల నుంచి పైస్థాయి అధికారి వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని కాంట్రాక్టర్లు సైతం తమ బాధను అయా వార్డు కౌన్సిలర్లు బంధువులు, స్నేహితుల వద్ద చెప్పుకుంటూ వాపోతున్నారని తెలిసింది.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గోల్‌మాల్

నర్సాపూర్ వద్ద గేటెడ్ కమ్యూనిటీ తరహాలో 2,420 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించారు. అర్హులను గుర్తించి నివాస పట్టా పత్రాలను అందజేశారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి పైఅంతస్తులో ఇళ్లను కేటాయించగా, వారు గృహప్రవేశం చేయకపోవడంతో అవి ఖాళీగా ఉంటున్నాయి. దీంతో కొందరు నాయకులు డబుల్ ఇళ్లను కబ్జా చేసి రూ.1.50 నుంచి రూ.3 లక్షల వరకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టా మార్పిడి చేసేందుకు అధికారులు సహకరిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై పలువురు కౌన్సిల్ సభ్యులు పట్టుబట్టడంతో విచారణకు ఆదేశించింది.

డిప్యూటేషన్ అధికారులను తిరిగి పంపాలి

వివిధ శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు అధికారులను తిరిగి స్థానాలకు పంపించి వేయాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అధికారులు ప్రజల వద్ద నుంచి ముక్కు పిండి మరీ డబ్బు వసూలు చేస్తున్నట్లు పలువురు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు అధికారుల మధ్య వచ్చిన గ్యాప్‌ను పక్కనపెట్టి, ఇకనైనా సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మెదక్ బంద్ ప్రశాంతం

● పోలీసుల నిఘాలో పట్టణం.. భారీగా బలగాల మోహరింపు

మెదక్ అర్బన్, జూన్ 16: మెదక్‌లో బీజేపీ అనుబంధ సంఘాల బంద్ ప్రశాంతంగా ముగిసింది. జంతువధపై శనివారం రాత్రి పట్టణంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దాంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ గొడవ నేపథ్యంలో బీజేపీ, బీజేవైఎం, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆదివారం పట్టణ బంద్‌కు పిలునిచ్చాయి. దాంతో వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాలు, మసీదుల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. బంద్ నేపథ్యంలో ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. మెదక్ జిల్లాతోపాటు, పక్క జిల్లాలైన సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందిన వందలాది పోలీసు బలగాలు తరలించి ప్రధాన కూడళ్లలో మోహరించారు. ఐజీ ఏవీ రంగనాథ్ స్వయంగా భద్రతను పర్యవేక్షించారు. టౌన్ పూర్తిగా పోలీసుల పహారాలో ఉంది. జిల్లా ఎస్పీ బాలస్వామి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహించారు.

మత ఘర్షణలు ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే : పంజా విజయ్‌కుమార్

మెదక్ ఎమ్మెల్యే మత ఘర్షణలను ప్రోత్సహిస్తున్నారని, హిందువులపై దాడికి పాల్పడిన మైనార్టీలు ఎమ్మెల్యే అనచరులేనని మెదక్ అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ ఆరోపించారు. గోవులను తరలింపును అడ్డుకున్న బీజేపీ అనుబంధ సంఘాల నేతలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మెదక్‌కు వస్తున్న బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేయడం ప్రభుత్వ పిరికిపంద చర్య అని విమర్శించారు. ఘటనపై పోలీసులకు సమాచారం ఇస్తే స్పందించలేదన్నారు. పరిస్థితిని అదుపు చేయడంలో పోలీసులు వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా పోలీసులు వ్యవహరించడం సరికాదన్నారు. గోవధను నివారించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకులు ఓ వర్గం వారికి సహకరిస్తున్నారన్నారని ఆరోపించారు. నిరసన వ్యక్తం చేసిన బీజేపీ జిల్లా, పట్టణ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, నాయిని ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. అరెస్టు చేసిన బీజేపీ నేతలను బేషరత్‌గా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మెదక్‌లో జరిగిన ఘటనకు పోలీసు వ్యవస్థ విఫలం కావడమే కారణమని భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పేర్కొన్నారు. కత్తిపోట్లు జరిగితే సుమోటోగా కేసు నమోదు చేయాలి.. కానీ పోలీసులు కొందరికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. బాధ్యులను అరెస్టు చేయకుంటే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని, రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

భక్తజన సందోహం

● కిటకిటలాడిన కొమురవెల్లి క్షేత్రం
● వైభవంగా హుస్నాబాద్ ఎల్లమ్మ జాతర
● సందడిగా కొండపోచమ్మ ఆలయం



కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తులు

చేర్యాల, జూన్ 16 : కొమురవెల్లి మల్లన్న దేవాలయం భక్తజనంతో హోరెత్తింది. స్వామివారి దర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లలో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ప్రాంగణాలు సందడిగా మారాయి. కాగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కోశాధికారి కొండ్లె మల్లికార్జున్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట సిద్దిపేట జిల్లా కార్యదర్శి తడక లింగమూర్తి తదితరులు ఉన్నారు.



ఎల్లమ్మ దేవికి పూజలు చేస్తున్న చాడ వెంకటరెడ్డి

రేణుకా ఎల్లమ్మ దర్శనానికి నాలుగు గంటలు

హుస్నాబాద్, జూన్ 16 : హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మతల్లి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. రద్దీ పెరుగడంతో అదనపు భారికేడ్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. ఆలయ మండపం భక్తులు సమర్పించే పట్నాలు, బోనాలతో నిండిపోయింది. మే 23న ప్రారంభమైన ఈ జాతర నెల రోజుల పాటు జరుగుతుంది. మరో ఆరు రోజుల్లో ముగియనుండటంతో దినదినం భక్తుల రద్దీ పెరుగుతుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఆది, మంగళవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిసి కూడా ఆలయాధికారులు తగిన ఏర్పాట్లు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సుగుణ దంపతులు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు.

కొండపోచమ్మ వద్ద భక్తుల రద్దీ



కొండపోచమ్మ తల్లి

జగదేవ్‌పూర్, జూన్ 16 : మండల పరిధి తిగుల్ నర్సాపూర్‌లోని కొండపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. హైదరాబాద్, వివిధ జిల్లాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఎదుట పట్నాలు వేసి బోనాలు తీశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.



హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

కాజీపల్లి పారిశ్రామిక కాలుష్యంపై ప్రజాపోరాటం

- కాలుష్య తీరుపై సమావేశం
- దశలవారీ ఆందోళనలకు అఖిలపక్ష నాయకుల కార్యాచరణ

జిన్నారం, జూన్ 16: కాజీపల్లి పారిశ్రామికవాడలోని పలు రసాయన పరిశ్రమల కాలుష్యంతో మూడు దశాబ్దాలుగా తీవ్రంగా నష్టపోయామని ఇక జల, వాయు కాలుష్యంపై ప్రత్యక్ష పోరాటాలు చేపడతామని అఖిలపక్ష నాయకులు అన్నారు. ఆదివారం జిన్నారం మండలం కాజీపల్లిలో స్థానిక పరిశ్రమల కాలుష్యం తీరుపై వివిధ పార్టీలు, యువజన సంఘాలు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. కాజీపల్లికి చెందిన న్యాయవాది దండె రమాకాంత్ ఆధ్వర్యంతో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఎంపీటీసీ భార్గవ, నాయకులు ఆకుల నవీన్, గడ్డె నర్సింహులు, అశోక్,



సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

సురేష్, బీమా పాల్గొన్నారు. స్థానిక పరిశ్రమల కాలుష్యంతో మూడు దశాబ్దాలుగా గ్రామ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, జలాశయాలు, పంట పొలాలు కాలుష్యమయంగా మారాయని సమావేశంలో అన్నారు. పర్యావరణ నిబంధనలు పాటించకుండా జల కాలుష్యాన్ని వదిలేస్తూ సహజ వనరులను నాశనం చేశారని, వాయు కాలుష్యం తీవ్రతతో స్థానికులు వివిధరోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా స్థానికంగా ఉన్న రసాయన పరిశ్రమలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీకి తరలివెళ్లాలని, ఇకపై కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై ప్రజా పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

మానవత్వాన్ని చాటుకున్న గోపాల్

చిలప్‌చెడ్, జూన్ 16: పర్సును పోగొట్టుకున్న వ్యక్తి అడ్రస్ కనుక్కుని పర్సు అందజేసిన సంఘటన చిలప్‌చెడ్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఆదివారం అందోల్ మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన జెట్ల లక్ష్మీనారాయణకు చెందిన పర్సు చిలప్‌చెడ్ గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్‌కు దొరికింది. ఆ పర్సులో ఉన్న ఆధార్‌కార్డు సహాయంతో బాధితుడి అడ్రస్ తెలుసుకుని ఫోన్‌చేశాడు. సదరు వ్యక్తిది జోగిపేట పట్టణం అని తెలుసుకుని వెళ్లి పర్సును అందజేశాడు. పర్సులో రూ.1000తో పాటు బంగారం ఉంగరం ఉన్నది. ఈ సందర్భంగా గోపాల్‌ను అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుట్లల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

\- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటిలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో' మొబిలిటీకి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బీహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

వైద్యం వికటించి రోగి మృతి

- చౌటకూర్‌లో ఆర్ఎంపీ నిర్వాకం
- మృతుడి భార్య ఫిర్యాదు.. కేసు నమోదు



బైరు మల్లేశం(ఫైల్)

పుల్‌కల్, జూన్ 16: వైద్యం వికటించి రోగి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం చౌటకూర్‌లో జరిగింది. పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బైరు మల్లేశం(48) అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం చౌటకూర్‌లోని ఆర్ఎంపీ డాక్టర్ వెంకటేశం వద్దకు చికిత్స కోసం వెళ్లాడు. మల్లేశంను పరిశీలించిన ఆర్ఎంపీ ఇంజక్షన్ ఇచ్చాడు. కొద్దిసేపటికే మల్లేశంకు చెమటలు పట్టి, మూత్ర విసర్జన చేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఆర్ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతిచెందాడని భార్య పద్మ ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆర్ఎంపీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అయితే ఆదివారం ఉప్పరిగూడెంలో మల్లేశం అంత్యక్రియలు జరిగాయి. మృతుడికి భార్య పద్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. దళితుడైన మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కలాలి ఈశ్వర్‌గౌడ్ కోరారు.

తండ్రిపై కుమారుడి దాడి

- చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి

చేర్యాల, జూన్ 16: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇటీవల తండ్రిని రోకలిబండతో తనయుడు బాది గాయాలపాలు చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన గిరక సత్తయ్య(45) అతడి కుమారుడు శివకుమార్ మధ్య కుటుంబ విషయంలో రెండురోజుల క్రితం తగాదా జరిగింది. మాటామాటా పెరగడంతో శివకుమార్ తండ్రి సత్తయ్యపై రోకలిబండతో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

రైతులకు డబ్బు చెల్లించిన సీడ్స్ ఆర్గనైజర్



రైతులకు చెక్కు అందజేస్తున్న సీడ్స్ ఆర్గనైజర్ మొగిలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కన్నపేట, జూన్ 16: అక్కన్నపేట మండల కేంద్రంలో రైతులు సాగుచేసిన వరి విత్తనోత్పత్తి పంటపై 'రాశి సీడ్స్ కంపెనీ భారీ మోసం' అని ఈనెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సీడ్స్ ఆర్గనైజర్ స్పందించారు. రాశి సీడ్స్ కంపెనీ రైతులకు చెల్లించాల్సిన డబ్బులను సీడ్స్ ఆర్గనైజర్‌కు ఎప్పుడో చెల్లించామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కానీ పంట దిగుబడి రాలేదని బాండ్ పేపర్‌పై రాసిచ్చిన విధంగా సీడ్స్ ఆర్గనైజర్ చెల్లించాలని రైతులు పట్టుబట్టారు. ఆదివారం స్పందించిన సీడ్స్ ఆర్గనైజర్ బదనాపురం మొగిలి అక్కన్నపేటలో రైతులతో సమావేశమయ్యారు. నీళ్ల లేక పంటలు ఎండిపోయాయని, అందువల్ల కొంచెం దిగుబడి తక్కువ వచ్చిందని, నీళ్లు బాగా ఉంటే 15 క్వింటాళ్ల పైనే పండుతుందని రైతులకు వివరించారు. ఈ ఏడాది నీళ్ల లేక రైతులకు దిగుబడి తగ్గినా బాండ్ పేపర్‌పై రాసిచ్చిన విధంగా డబ్బులు రైతులకు చెల్లించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ముస్తాబైన ఈద్గాలు, మసీదులు
- పండుగ సందర్భంగా ప్రజావాణి రద్దు



సంగారెడ్డిలోని ఈద్గాలో మంచినీటి సౌకర్యం

సంగారెడ్డి రూరల్, జూన్ 16: ముస్లింలు జరుపుకునే పండుగల్లో రంజాన్, బక్రీద్ అత్యంత ముఖ్యమైనవి. రంజాన్ పర్వదినాన ముస్లింలు నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి భక్తిభావంతో ఐదుసార్లు నమాజ్ చేస్తారు. అయితే త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలిచిందని చెప్పవచ్చు. బక్రీద్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి సమీపంలోని కల్పగూర్‌లో గల ఈద్గావద్ద ముస్లిములు నమాజ్ చేసేందుకు మంచినీటి ట్యాప్‌లు, టెంట్లు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పండుగకు ప్రొటోకాల్ ప్రకారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి ఇతర ప్రముఖులను ఆహ్వానించామని ఈద్గా కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రార్థనలకు సుమారు ఐదువేల మంది వరకు వచ్చే అవకాశమున్నదని, ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

మెదక్‌లో ముస్తాబైన ఈద్గా, మసీదులు

మెదక్ కల్చరల్, జూన్ 16: బక్రీద్ వేడుకలకు మెదక్ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఈద్గాలు, మసీద్‌లు ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా పట్టణ, పరిసర ప్రాంతాల్లో పొట్టేలు, మేకల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈద్గా కమిటీ తరఫున జిల్లా కేంద్రంలోని ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.45 గంటలకు నమాజ్ జరుగుతుందని, జామే మసీద్‌లో ఉదయం 9.15 గంటలకు నమాజ్ ఉంటుందని ఈద్గా కమిటీ అధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి ఆరీఫ్, కార్యదర్శి నయీమ్, కోశాధికారి ఏజాజోద్దీన్ తెలిపారు.



ఈద్గాలో ప్రార్థనలు చేసేందుకు ఏర్పాటు చేసిన టెంట్లు

ప్రశాంతంగా జరిగేలా చూడాలి: కలెక్టర్

మెదక్ అర్బన్, జూన్ 16: నిబంధనల మేరకు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో ఎస్పీ బాలస్వామి, ఏఎస్పీ మహేందర్, మున్సిపల్, పంచాయతీ, రవాణాశాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ప్రశాంతమైన ప్రాంతమని, మత సామరస్యానికి చిహ్నమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి విజయశేఖర్‌రెడ్డి, జిల్లా రవాణ శాఖాధికారి వెంకటస్వామి పాల్గొన్నారు.

ముస్లింలకు హరీశ్‌రావు శుభాకాంక్షలు

సిద్దిపేట టౌన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 16: ఈద్-ఆల్-అదా (బక్రీద్) పండుగ పురస్కరించుకుని ముస్లిములకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.

'ప్రజావాణి' రద్దు

సోమవారం బక్రీద్ పండుగ సెలవు కారణంగా మెదక్ జిల్లాలో, సిద్దిపేట జిల్లాలో జరిగే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్లు రాహుల్ రాజ్, మనుచౌదరి తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు ఇచ్చేందుకు కలెక్టరేట్ రావొద్దని సూచించారు.

దేశంలో రాజ్యమేలుతున్న ఫ్యూడల్ వ్యవస్థ

- సన్యాసులు, బాబాల చేతిలో కీలుబొమ్మలుగా ప్రభుత్వాలు
- రాజ్యాంగ ధిక్కారానికి పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు
- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం



విద్యా సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

గజ్వేల్, జూన్ 16: దేశంలో ఫ్యూడల్ వ్యవస్థ రాజ్యమేలుతుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాసీం అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఆదివారం ఉపాధ్యాయ దర్శిని మాసపత్రిక సంపాదకుడు ప్రకాశ్‌రావు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన విద్యాసదస్సులో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో కలిసి పాల్గొన్నారు. అనంతరం 'సంక్షోభంలో సామాజిక విలువలు' అనే అంశంపై ప్రసంగించారు. నేటి సమాజంలో మతాన్ని రాజకీయంలోకి తీసుకురావడమే ఫ్యూడల్ వ్యవస్థ అన్నారు. ఫ్యూడల్ వ్యవస్థలో విలువలకు స్థానం ఉండదని, మతాలు, కులాల ప్రాతిపదికన ప్రజలు విచ్ఛిన్నం అవుతారన్నారు. పదేపదే మతాల గురించి ప్రధాని మాట్లాడినా.. స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల సంఘం మాట్లాడలేదన్నారు. సన్యాసిలకు కాళ్లు మొక్కుతూ అది విలువగా ప్రచారం చేస్తూ అంతా అనుసరించేలా చేస్తున్నారని, గతంలో రాష్ట్రపతి శంకర్ దయాల్‌శర్మ తిరుపతికి వెళ్లి పొర్లు దండాలు పెట్టేవారని ఆయనను చూసి మిగతా వారు నేర్చుకునేలా ఉండేదన్నారు. సన్యాసులు రాజ్యం నడిపేలా చేస్తున్నారని, పురుషాధిక్య విలువలను ఫ్యూడలిజం పెంచి పోషిస్తున్నదని చెప్పారు. నేటి సమాజంలో చదువు, సంస్కారం పెరిగే కొద్ది బాబాలను పూజించడం తగ్గాలని కానీ అలా తగ్గడం లేదన్నారు. దీంతో సామాజిక విలువలు సంక్షోభంలోకి వెళ్తున్నాయని, దేశ అధినేత దేవుడిపైకి ప్రతి అంశాన్ని నెట్టివేసేలా పనిచేస్తున్నారన్నారు. అలాగే ఉపాధ్యాయులు గతంలో ప్రజా ఉద్యమాల్లో, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు ఉండేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. కులాన్ని వదిలేసి కింది వర్గంతో మమేకమైన వ్యక్తి ఉపాధ్యాయ దర్శిని మాసపత్రిక సంపాదకుడు ప్రకాశ్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వై.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, పూర్వ అధ్యక్షుడు రాంచంద్రం, పూర్వ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, కొండల్‌రెడ్డి, హనుమాండ్లు, జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



గజ్వేల్ విద్యా సదస్సులో పాట పాడుతున్న విమలక్క

అవమాన భారంతో కార్మికుడి ఆత్మహత్య

- విధులకు వెళ్లనివ్వకుండా సెక్యూరిటీ అడ్డుకున్నారని మనస్తాపంతో అఘాయిత్యం
- సంగారెడ్డి జిల్లాలో ఘటన



ఆందోళన చేస్తున్న కుటుంబీకులు, గ్రామస్థులు



మహేష్(ఫైల్)

హత్నూర, జూన్ 16: విధులకు హాజరయ్యేందుకు పరిశ్రమలోకి వెళ్లనీయకుండా అడ్డుకుని సెక్యూరిటీ సిబ్బంది అవమానించారనే మనస్తాపంతో ఓ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పరిశ్రమ ఎదుట ఉన్న ఓ విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ తీగలను ముట్టుకుని ప్రాణం వదిలాడు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామ శివారులోని ఎస్‌సీఎల్ విన్‌టెక్ పరిశ్రమ వద్ద శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో చెక్కల మహేష్(30) అనే వ్యక్తి మరణించాడు. బాధిత కుటుంబం, స్థానికుల కథనం ప్రకారం.. హత్నూర మండలం సాదుల్లానగర్‌కు చెందిన మహేష్ కొంతకాలంగా విన్ టెక్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మహేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, నైట్ డ్యూటీ కోసం శనివారం రాత్రి పరిశ్రమ వద్దకు చేరుకున్న మహేష్‌ను సెక్యూరిటీ సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు అడ్డుకున్నారు. మద్యం తాగి వచ్చావని, విధులకు అనుమతించమని చెప్పారు. మహేష్ ద్విచక్రవాహనం తాళాలను కూడా తీసుకుని, పోలీసులను పిలుస్తామని భయపెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన మహేష్ పరిశ్రమ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి 11కేవీ విద్యుత్ తీగలు పట్టుకుని విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. కాగా, మహేష్ మృతదేహంతో అతని కుటుంబసభ్యులు, గ్రామప్రజలు ఆదివారం ఉదయం పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. మహేష్ మరణానికి బాధ్యత వహిస్తూ పరిశ్రమ యాజమాన్యం అతని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆందోళనను విరమింపచేసేందుకు విఫలయత్నం చేశారు. అనంతరం, పోలీసుల సమక్షంలో చర్చలు జరిపిన పరిశ్రమ ప్రతినిధులు మహేష్ కుటుంబానికి రూ.11 లక్షలు పరిహారంగా ఇస్తామని హామీ ఇచ్చారు. మహేష్ మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చేర్యాలలో శివాజీ విగ్రహావిష్కరణ

● నివాళులర్పించిన ముస్లింలు



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లింలు

చేర్యాల, జూన్ 16: శివాజీ మహరాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలోని వీటీకే చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హిందూధర్మ పరిరక్షణకు పాటుపడిన శివాజీ ఆశయసాధనకు పాటుపడాలని పేర్కొన్నారు. జై శివాజీ... జై భవాని నినాదాలు మిన్నంటాయి. శివాజీ విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తూ పట్టణానికి చెందిన పలువురు ముస్లిం సోదరులు శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పించి మత సామరస్యం చాటుకున్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

దౌల్తాబాద్, జూన్ 16: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆదివారం పబ్బ అశోక్ ఇంట్లో 30వ రోజు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ మహిళా విభాగం సంఘం కార్యదర్శి పబ్బ మాధవి అశోక్, మండల ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు బజారు!

● రోడ్లపై మాంసం, కూరగాయల విక్రయం
● ఇబ్బందులు పడుతున్న సమీప కాలనీవాసులు, వాహనదారులు



చిన్నకోడూరులో రోడ్డుకు ఇరువైపులా మాంసం, కూరగాయల విక్రయ దుకాణాలు



చిన్నకోడూరు రైతు బజారులో మొలిచిన పిచ్చి మొక్కలు, గడ్డి, ముళ్ల పొదలు

చిన్నకోడూరు, జూన్ 16: రాజుల సొమ్ము రాళ్ల పాలు, ప్రజల సొమ్ము నేలపాలు అన్న చందంగా మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు బజారు వసతుల లేమితో నిరుపయోగంగా మారింది. దీంతో రైతు బజారులో పిచ్చి మొక్కలు, గడ్డి, మొలిచింది. పండించిన కూరగాయలను దళారుల ప్రమేయం లేకుండా రైతులు సొంతంగా అమ్ముకునే విధంగా రూ.30 లక్షల అంచనా వ్యయంతో కూరగాయల మార్కెట్ (రైతు బజారు)ను నిర్మించారు. ఈ మార్కెట్‌ను 2018 మే 17న ప్రారంభించారు.

మూణ్ణాళ్ల ముచ్చట

మార్కెట్‌లో కార్యాలయం, నీరు, విద్యుత్, తదితర వసతులు ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో 18 దుకాణాలు ఏర్పాటు చేయగా, వాటిలో 10 మాంసాహార విక్రయ దుకాణాలకు, 8 కూరగాయల విక్రయ దుకాణాలకు కేటాయించారు. మార్కెట్‌లో సుమారు ఏడాదిన్నర పాటు విక్రయాలు సక్రమంగా సాగాయి.

గిరాకీ తగ్గడంతో రోడ్డుపైకి

ఇతర గ్రామాలకు చెందిన పలువురు వాహనాలపై కూరగాయలను తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తుండడంతో, రానురాను మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారుల సంఖ్య తగ్గిపోయింది. దీనికి తోడు మార్కెట్‌లో మురికి కాలువ నిర్మాణం లేకపోవడం విక్రయదారులకు ప్రధాన సమస్యగా మారింది. దీంతో విక్రయదారులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం సమీపంలోని రోడ్లకు ఇరువైపులా మాంస విక్రయ దుకాణాలను ఏర్పాటు చేసుకుని మాంసం, తోపుడు బండ్లపై కూరగాయలు విక్రయిస్తున్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు

మాంసం, కూరగాయాల విక్రయదారులు మార్కెట్‌లో తమకు కేటాయించిన దుకాణాలను ఖాళీ చేసి స్థానిక అంబేడ్కర్ విగ్రహం సమీపంలో రోడ్లకు ఇరువైపులా విక్రయిస్తుండడంతో మాంసం విక్రయదుకాణాల నుంచి దుర్వాసన వస్తున్నదని స్థానిక కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మాంసం విక్రయ దుకాణాల నుంచి ఈగలు ఇళ్లలోకి ప్రవేశించి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక మాంసం దుకాణాల వద్ద శునకాలు స్వైరవిహారం చేస్తూ, వాహనాలను వెంబడిస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి కారణంగా ఆ రహదారుల గుండా మహిళలు, పాఠశాలలకు వెళ్లాలంటే చిన్నారులు జంకుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

మార్కెట్‌ను మందుబాబులు అడ్డాగా మార్చుకొని రాత్రివేళలో అక్కడ మద్యం సేవిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మార్కెట్‌లో మురికి కాలువ నిర్మాణం, ఇతరత్రా వసతులు కల్పించి రైతు బజారులో మాంసం, కూరగాయాల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేసీఆర్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్ యత్నం

● బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 16: మాజీ సీఎం కేసీఆర్‌పై విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారాన్ని బూచిగా చూపుతూ, బురదజల్లేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ, ఏదో ఒక సాకుతో అబద్ధపు ప్రచారంతో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఎడారిగా ఉన్న రాష్ట్రాన్ని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ లాంటి ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని, ప్రస్తుతం మండుటెండల్లో కూడా గోదావరి జలాలను పారించి సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. విద్యుత్ కమిషన్ విచారణ పేరుతో ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని, కమిషన్ విచారణ పేరుతో కేసీఆర్ ప్రతిష్ఠను తగ్గించేలా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు.

గజ్వేల్ రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డు అందుకుంటున్న గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు

ములుగు, జూన్ 16: రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ నిర్వహించిన కార్యక్రమాలకు అవార్డుల పంట పండింది. భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల వేడుకలో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్‌కు ప్రత్యేక స్థానం లభించింది. బెస్ట్ ఔట్ స్టాండింగ్ పర్ఫార్మెన్స్ అవార్డుతో క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాబుగౌడ్ మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరంలో రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సుమారు 500 సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. దివ్యాంగులకు కృత్రిమ చేతులు, కాళ్లు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సామల నరసింహారెడ్డి, మెంబర్ అట్రాక్షన్ ఛైర్మన్ కొడాలి చంటి, వాటర్ అండ్ శానిటరీ ఛైర్మన్ కుంట కరుణాకర్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు జగదీశ్వర్, క్లబ్ సభ్యులు సాయిరెడ్డి, నరేష్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

వెల్దుర్తి, జూన్16: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవామనాలు ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని హస్తాల్‌పూర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధిలోని మనేపల్లికి చెందిన అశోక్, అఖిల దంపతులు ద్విచక్రవాహనంపై తూప్రాన్ వైపు వెళ్తున్నారు. దంతాన్‌పల్లి నుంచి హస్తాల్‌పూర్ వైపు గొర్కంటి యాదగిరి, నెల్లూరుల ద్విచక్ర వాహనం వస్తున్నారు. వీరు హస్తాల్‌పూర్‌లో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అశోక్, అఖిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ నవతగౌడ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రూ.1.60 లక్షల ఎల్‌వోసీ అందజేత



మర్కుక్: మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పాండుగౌడ్

మద్దూరు, జూన్ 16: మండలంలోని సలాఖ్‌పూర్‌కు చెందిన ఎర్ర మల్లేశం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్యఖర్చులకు డబ్బులు లేక ఆందోళన చెందుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చులకు రూ.1.60 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఎల్‌వోసీని బాధితుడు ఎర్ర మల్లేశానికి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా నాగపురి కిరణ్‌కుమార్‌కు మల్లేశం కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

● **మర్కుక్:** మండలంలోని పాములపర్తిలో చెరువులో పడి గ్రామానికి చెందిన మునిగడప అంజనేయులు మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పాండుగౌడ్ ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారితో నర్సింహులు, బాలకృష్ణ, రఘుపతి, పోచయ్య మహేష్, అనిల్, పోచయ్య ఉన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ మండలం గిరిపల్లికి చెందిన ఎన్కమోళ్ల ప్రణీత్ బహుళ అవయవ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గుర్రం తులసీదాస్, ఉపాధ్యక్షుడు కొండాపురం యాదగిరి, కోశాధికారి దొంతుల ఆనంద్, గుంటుకు శ్రీనివాస్, పిట్ల అంజనేయులు, టెంట్ నర్సింహులు, నాగపురి రమేశ్, యాట అంజనేయులు, భువనగిరి రవీందర్, నందాల కృష్ణ, గుర్రం శ్రీకాంత్ చౌదరి తదితరులున్నారు.

మాచాపూర్‌లో పోచమ్మ తల్లికి బోనాలు

చిన్నకోడూరు, జూన్ 16: మండలంలోని మాచాపూర్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవత పోచమ్మకు బోనాలు తీశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



చిన్నకోడూరు: మాచాపూర్‌లో బోనాలతో మహిళలు

ఆకునూరులో బోనాల పండుగ

చేర్యాల, జూన్ 16: చేర్యాల మండలం ఆకునూరులో గ్రామ దేవతల బోనాల పండుగను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిప్రపత్తులతో బోనాలు తయారుచేసి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా పోచమ్మ, నల్లపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు నివేదించారు. తమ పాడి పంటలు, పసుపు కుంకుమలు చల్లగా కాపాడాలని వేడుకున్నారు.



చేర్యాల: ఆకునూరులో ఊరేగింపుగా పోచమ్మతల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పోతిరెడ్డిపల్లిలో ఎల్లమ్మ ఆలయ ప్రతిష్ఠ

చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో రేణుకాఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పూజలు జరిపారు. మరో రెండు రోజులు వేడుకలు జరగనున్నాయి.

తండ్రితో గొడవపడి.. కుమారుడి అదృశ్యం

తూప్రాన్, జూన్ 16: డబ్బుల విషయమై తండ్రితో గొడవ జరగడంతో మనస్తాపానికి గురై కుమారుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి చెందిన దుర్గి శివయ్య (45), లక్ష్మీ దంపతులు బీడీకాలనీలో నివాసముంటున్నారు. తండ్రి చంద్రయ్యకు ఇవ్వాల్సిన డబ్బుల విషయంలో గొడవ జరుగుతున్నది. ఈ విషయంలో శివ్వయ్య తీవ్ర మనస్తాపంతో ఉన్నాడు. ఈనెల 14న రాత్రి ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. శివ్వయ్య కోసం వెతికినప్పటికీ, ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శివయ్య (ఫైల్)

ఉద్యోగ విరమణ వీడ్కోలు

సిద్దిపేటక్రైం, జూన్ 16: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గౌటే కనకయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని ఓ గార్డెన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల్లోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కనకయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఏసీజీఈ లక్ష్మయ్య, అంకిరెడ్డిపల్లె పీజీ హెచ్ఎం గోపాల్‌రెడ్డి, మిట్టపల్లి పీజీ హెచ్ఎం బాల ప్రసాద్, కొండపాక పీజీ హెచ్ఎం సముద్రాల శ్రీనివాస్, టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అన్నమారెడ్డి, మిట్టపల్లి ఉపాధ్యాయురాలు విజయ లక్ష్మి, ఉపాధ్యాయులు నర్సింహులు, లక్ష్మీనరసింహ, టీఎస్టీపీ జిల్లా అధ్యక్షుడు గ్యదారి పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్, జూన్ 16: నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ గ్రామంలో దళితులను కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహ్మదాబాద్ గ్రామంలోని దళిత వర్గానికి చెందిన పెంటయ్య, కృష్ణలపై అదే గ్రామానికి చెందిన కొందరు స్థలం విషయంలో గొడవ పడి కులంపేరుతో దూషించి దాడి చేశారని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను లిఖితపూర్వకంగా కోరినట్లు చెప్పారు.

'అక్రమంగా గోవులను తరలిస్తే తీవ్రపరిణామాలు'

చిన్నశంకరంపేట, జూన్ 16: అక్రమంగా గోవులను తరలిస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని బీజేపీ మండలాధ్యక్షుడు పోగుల రాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం సూరారం చౌరస్తాలో ఆటోలో తరలిస్తున్న గోవులను బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు పట్టుకుని పీఎస్‌కు తరలించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాచర్ల అశోక్, ధశరథం, ఆకుల రాజు, మేడి శ్రీను, మధు, బాబు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

'ఉత్తమ్'ను సన్మానించిన ఎంపీ

నారాయణఖేడ్, జూన్ 16: రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ఘన విజయంసాధించిన సందర్భంగా సురేష్‌షెట్కార్ ఉత్తంకుమార్‌రెడ్డిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వివాహిత పరార్!

చేర్యాల, జూన్ 16: చేర్యాల మండలం కాశీగుడిశెలు గ్రామానికి చెందిన వివాహిత ఓ వ్యక్తితో పరారైన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భర్త జీవనోపాధి కోసం మస్కట్‌లో ఉంటుండగా, కొద్దిరోజులక్రితం ఇక్కడికి వచ్చి ఈనెల 6వ తేదీన తిరిగి వెళ్లిపోయాడు. శనివారం రాత్రి కుటుంబసభ్యులందరూ కలిసి ఇంట్లో నిద్రించారు. తన మూడేళ్ల పాపను, వంటిపై ఉన్న పుస్తెలతాడు, మెట్టెలను వదిలేసి బంగారం, నగదు, వెండి ఆభరణాలతో ఆమె అర్ధరాత్రి పరారైంది. ఆదివారం తెల్లవారు జామున ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై తమకు అనుమానం ఉన్నదని వారు తెలిపారు.

గజ్వేల్ మండలానికి ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వాలి

● టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాయిని యాదగిరి

గజ్వేల్, జూన్ 16: గజ్వేల్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరి నాయిని యాదగిరి కోరారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం ఆయన మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్నగారి రాజులతో కలసి ఆంధ్రజ్యోతితో ఫోన్లో మాట్లాడారు. గతంలో నర్సారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని జగదేవ్‌పూర్ మండలానికి చెందిన వ్యక్తికే ఇచ్చారని, మరోసారి జగదేవ్‌పూర్ మండలానికి చెందిన వ్యక్తికే పదవి ఇవ్వాలని చూస్తుండడాన్ని తప్పుబట్టారు. తాము పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, కష్టపడిన తమ ముగ్గురిలో ఒకరికి చైర్మన్ పదవి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని కోరారు.

'నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేట టౌన్, జూన్16: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సిద్దిపేట జిల్లా నాయీ బ్రాహ్మణుల నిర్మాణ కమిటీ సభ్యులు కొండూరు సతీష్ కుమార్, సింగరాల కనకయ్య, సింగిరాల శ్రీనివాస్‌లు తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల జిల్లా కమిటీ ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 18న సిద్దిపేట జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పునర్నిర్మాణం కోసం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి వైద్యులుగా పిలవబడే నాయీ బ్రాహ్మణులు అభివృద్ధిలో మాత్రం పూర్తిగా వెనుకబడ్డారన్నారు. ఈ వెనుకబాటుతనాన్ని పోగొట్టుకునేందుకు పటిష్ఠమైన సంఘాలు అవసరమన్నారు. నాయీ బ్రాహ్మణులను రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ఈ ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈనెల 18న ఉదయం 9 గంటలకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరగనున్న సమావేశానికి నాయీ బ్రాహ్మణ సోదరులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏల్పుల స్వామి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

గజ్వేల్, జూన్ 16: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు బాధితులకు అందజేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని వేములఘాట్‌కు చెందిన కొండల్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం బైక్‌పై వెళ్తూ ఫోన్ పోగొట్టుకోగా, గజ్వేల్‌కు చెందిన తిరుపతి ఆరుబయట పడుకుని ఫోన్ పోగొట్టుకున్నాడు. వారి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హత్యాచారం చేసిన వ్యక్తులను శిక్షించాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్, జూన్ 16: హైదరాబాద్‌లోని ఓ ప్రాంతంలో గిరిజన బాలికపై హత్యాచారం చేసిన వ్యక్తులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం గిరిజన సంఘాల నాయకులు నిరసన తెలిపారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసనలో గిరిజన సంఘాల నాయకులు గుగులోతు తిరుపతినాయక్, రాజునాయక్, సత్యం నాయక్, రైనా నాయక్, రాజు నాయక్ ఉన్నారు.

వంటగదిలేక తిప్పలు



మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వంట గది లేక రేకుల షెడ్‌లో వంట చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్, జూన్ 16: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు వంట గది లేక తిప్పలు తప్పడం లేదు. రేకుల షెడ్ కింద వంట చేస్తూ, వానొస్తే అరిగోస, ఎండొస్తే రామగోసతో ఇక్కట్లు పడుతూ వంటలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. వర్షానికి వంట సామాన్లు, కూరగాయాలు, ఇతర వస్తువులు తడుస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వంట గది నిర్మించాలని వంట సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మున్సిపాలిటీలోని అవినీతిపై విచారణ జరపాలి

● బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్

హుస్నాబాద్, జూన్ 16: హుస్నాబాద్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇల్లు లేకున్నా ఇంటి బిల్లులు, నకిలీ నల్లా బిల్లులు, విద్యుత్‌శాఖ నుంచి విద్యుత్ బిల్లులు తీసుకుంటూ, సంబంధం లేని ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. వీటికి సాక్ష్యాధారాలు ఉన్నా కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఈ అవినీతినిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈనెల 19న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ సమావేశం

● జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ

సిద్దిపేట టౌన్, జూన్ 16: ఈనెల 19న హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ టీఎస్ కార్యవర్గ సమావేశం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా మేడి పాపన్న మాదిగ హాజరవుతున్నట్లు వెల్లడించారు. సిద్దిపేటతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల, మండలాల, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి ఉద్యమకారులందరూ హాజరుకావాలని కోరారు. విద్యా హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. చలో ఢిల్లీ ఏర్పాట్లు, జూలై 7న దండోరా జెండా పండుగ ఏర్పాట్లపై చర్చ సమీక్ష ఉంటుందని, భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నబోయిన 'మర్రి' ముచ్చాల

● ఊరికి ఆనవాలుగా భారీ వృక్షం
● రోడ్డువిస్తరణతో నేలమట్టం





గ్రామ ప్రధాన చౌరస్తాలోని ఏళ్లనాటి భారీ మర్రిచెట్టు, చెట్టు నీడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

చేర్యాల, జూన్ 16: కొమురవెల్లి మండలం మర్రి ముచ్చాల గ్రామం చిన్నబోయింది. దశాబ్దాల క్రితం ఊరి నామకరణానికి కారణమైన భారీ వృక్షాన్ని నేలకూల్చడంతో కళ తప్పి ఒక్కసారిగా బోసిపోయింది. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా వృక్షం నామరూపాలు తొలగించడంతో ఉనికి కోల్పోయింది. కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలో ప్రధాన రహదారి పక్కన భారీ మర్రి చెట్టు ఉంది. ఆ చెట్టుకు ముత్యాలవల్లె మర్రిపండ్లు విరగబూయడంతో గ్రామానికి ఆ పేరు వచ్చిందని పెద్దలు చెబుతుంటారు. చెట్టు ప్రాంగణం ఆధ్యాత్మిక, సాంస్కృతిక, రాజకీయ కార్యక్రమాలకు ఆసరాగా నిలిచింది. బతుకమ్మ పండుగైనా, భగవత్ ఆరాధనైనా చెట్టు ఆవరణలోనే గ్రామస్థులు జరుపుకునేవారు. ఊరికి కొత్తవారు ఎవరు వచ్చినా మర్రి చెట్టు చూడగానే టక్కున మర్రిముచ్చాల అని గుర్తించేవారు. కానీ ప్రస్తుతం అవి అన్నీ మధుర జ్ఞాపకాంగా మారాయి. సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారి 365-బి నిర్మాణంలో భాగంగా కొన్నినెలల క్రితం జనగామ-సిద్దిపేట రహదారి విస్తరణ పనులు చేపట్టారు.



భారీ మర్రివృక్షాన్ని నేలకూల్చడంతో బోసిపోయిన గ్రామ ప్రధాన ప్రదేశం

కాజీపల్లిలో ప్రభుత్వ భూమిని చదును చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



కాజీపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు చదును చేసిన భూమి

జిన్నారం, జూన్ 16: జిన్నారం మండలం కాజీపల్లిలో పేదల ఇంటి స్థలాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని గుర్తుతెలియని వ్యక్తులు చదును చేశారు. కాజీపల్లి 181 సర్వే నెంబర్‌లో 6నెలల క్రితం నాటి ప్రభుత్వం పేదల నివాసాల కోసం స్థలాన్ని కేటాయించినది. ఇప్పటికే అక్కడ 50 వరకు నివాసాలను నిర్మించగా, ఖాళీగా ఉన్న సుమారు 20 ప్లాట్ల స్థలాన్ని శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చదును చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇంటి స్థలాల నెంబర్లను తొలగించడంతో స్థానిక పేదలు ఆందోళన చెందుతున్నారు.

'మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి'

నారాయణఖేడ్, జూన్ 16: జనాభా, దామాశ ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి మాదిగ జనసభలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారిగా జన సభలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లలో భాగంగా 7 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నందున, మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా దామాశ ప్రకారం 12 శాతం రిజర్వేషన్ కల్పించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మాదిగలు అత్యధికంగా ఉన్నందున రిజర్వేషన్ పెంపుతో వారి అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి పగిడిపల్లి రమేష్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, నాయకులు మనోహర్, అలిగే జీవన్, ప్రసాద్, ఏసుదాస్, యూత్ నాయకులు సుకుమార్, తుకారం, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



కొమురవెల్లి జడ్పీఎస్ఎస్‌లో 2007-08లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

- చేర్యాల